దాదా కొత్త ఇన్నింగ్స్

ఇండియన్ రేసింగ్ లీగ్‌లో ఫ్రాంచైజీ కొనుగోలు

ఢిల్లీ: భారత క్రికెట్ జట్టు మాజీ సారథి సౌరవ్ గంగూలీ మరో కొత్త ఇన్నింగ్స్ మొదలుపెట్టాడు. గత రెండు సీజన్లుగా దేశంలో మోటార్ స్పోర్ట్స్ ప్రేమికులను అలరిస్తున్న ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్ఎల్)లో దాదా ఫ్రాంచైజీ కొనుగోలు చేశాడు. 'కోల్‌కతా రాయల్ టైగర్స్' పేరిట ఫ్రాంచైజీని కొన్న గంగూలీ రాబోయే సీజన్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్టు చెప్పాడు. ఈ లీగ్‌లో కోల్‌కతా పాల్గొంటుండటం ఇదే ప్రథమం కాగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, గోవా, కొచ్చి, అహ్మదాబాద్ వంటి ఫ్రాంచైజీలు ఇదివరకే అభిమానులను అలరిస్తున్నాయి. ఈ లీగ్‌లో మూడో ఎడిషన్ వచ్చే ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో జరుగనుంది.

యూరో ఫైనల్‌కు ఇంగ్లండ్

స్పెయిన్‌తో టైటిల్ పోరుకు అమీతుమీ

సెమీస్‌లోనే నిష్క్రమించిన నెదర్లాండ్స్

డార్ట్‌మండ్: ప్రతిష్టాత్మక యూరో చాంపియన్‌షిప్‌లో ఇంగ్లండ్ వరుసగా రెండోసారి ఫైనల్ చేరింది. గురువారం జరిగిన రెండో సెమీస్‌లో ఇంగ్లండ్ 2-1తో నెదర్లాండ్స్‌ను ఓడించింది. ఇంగ్లండ్ సారథి హ్యారీ కేన్‌కు సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన ఒలీ వాట్కిన్స్ 90వ నిమిషంలో గోల్ చేసి ఇంగ్లండ్‌ను ఫైనల్‌కు చేర్చాడు. నెదర్లాండ్స్ తరపున జావి సిమన్స్ 7వ నిమిషంలోనే గోల్ చేసి ఆట ఆరంభంలోనే డచ్ జట్టును ఆధిక్యంలోకి తెచ్చాడు. కానీ 18వ నిమిషంలో హ్యారీ కేన్ గోల్ చేసి స్కోర్లను సమం చేశాడు. ఆ తర్వాత ఇరు జట్లూ ఎంత ప్రయత్నించినా గోల్ కొట్టలేకపోయాయి. మరికొద్దిసేపట్లో మ్యాచ్ ముగుస్తుందనగా సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన వాట్కిన్స్ చివరి నిమిషంలో చేసిన గోల్‌తో నెదర్లాండ్స్ ఆశలపై నీళ్లు చల్లాడు. ఈ విజయంతో ఇంగ్లండ్.. ఈనెల 15న స్పెయిన్‌తో టైటిల్ పోరులో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ టోర్నీలో 12 ఏండ్ల తర్వాత ఫైనల్ చేరిన స్పెయిన్ కప్పు కొట్టాలనే పట్టుదలతో ఉంటే ఇంతవరకూ యూరో కప్ నెగ్గని ఇంగ్లండ్ ఈసారైనా ఆ ముచ్చటను తీర్చుకోవాలని భావిస్తున్న నేపథ్యంలో ఇరు జట్ల మధ్య రసవత్తర పోరు జరుగనుంది.

అర్జెంటీనా X కొలంబియా

అమెరికా వేదికగా జరుగుతున్న కోపా అమెరికా ఫైనల్ ప్రత్యర్థులెవరో తేలిపోయింది. గురువారం ఛార్లెంట్ (అమెరికా) వేదికగా జరిగిన మ్యాచ్‌లో కొలంబియా 1-0తో ఉరుగ్వేను ఓడించి ఫైనల్ చేరింది. కొలంబియా ఆటగాడు జెఫర్‌సన్ లెర్మా 39వ నిమిషంలో గోల్ చేయగా ఉరుగ్వే ఒక్క గోల్ చేయలేకపోయింది. సోమవారం జరుగబోయే ఫైనల్‌లో కొలంబియా.. లియోనల్ మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనాను ఢీకొనుంది. మూడో స్థానం కోసం ఉరుగ్వే, కెనడా తలపడనున్నాయి.

ఓటమిని జీర్ణించుకోలేక..

ఆటలో గెలుపోటములు సహజమే అయినా తమ అభిమాన జట్టు ఓటమిని నెదర్లాండ్స్ అభిమానులు జీర్ణించుకోలేకపోయారు. యూరో కప్‌లో నెదర్లాండ్స్ ఓడిపోయాక ఆ జట్టు అభిమానులు ఇంగ్లండ్ ఫ్యాన్స్‌పై దాడికి దిగారు. మ్యాచ్ ముగిశాక ఓ పబ్‌లో సంబురాలు చేసుకుంటున్న ఇంగ్లండ్ అభిమానులను లక్ష్యంగా చేసుకుని వారిపై పిడిగుద్దులు గుద్దుతూ అక్కడున్న కుర్చీలు, బల్లలను చెల్లాచెదురుగా పడేసి రచ్చ చేశారు. మరోవైపు కోపా అమెరికా టోర్నీలో భాగంగా కొలంబియాతో మ్యాచ్ ఓడాక ఉరుగ్వే ఆటగాళ్లే ప్రత్యర్థి జట్టు అభిమానులపై దాడి చేశారు. మ్యాచ్ ఓడి నిరాశగా డ్రెస్సింగ్‌రూమ్‌కు వెళ్తున్న ఉరుగ్వే ఆటగాడు డార్విన్ నునెజ్‌తో పాటు మరో ఇద్దరు కలిసి కొలంబియా అభిమానుల వద్దకు వెళ్లి దాడికి పాల్పడ్డారు.

పలోని సంచలనం

తొలిసారి వింబుల్డన్ ఫైనల్స్‌కు అర్హత • సెమీస్‌లో ఓడిన వెకిచ్

లండన్: కొద్దిరోజుల క్రితమే ముగిసిన ప్రతిష్టాత్మక ఫ్రెంచ్ ఓపెన్‌లో సంచలన ఆటతీరుతో ఫైనల్ చేరిన ఇటలీ అమ్మాయి జాస్మిన్ పలోని వింబుల్డన్‌లోనూ సత్తాచాటింది. గురువారం సెంటర్ కోర్టు వేదికగా జరిగిన మహిళల సింగిల్స్ తొలి సెమీస్‌లో ఏడో సీడ్ పలోని 2-6, 6-4, 7-6 (10/8)తో డొనా వెకిచ్ (క్రొయేషియా)ను ఓడించి తన కెరీర్‌లో తొలిసారి వింబుల్డన్ ఫైనల్ చేరింది. తద్వారా ఈ టోర్నీ మహిళల సింగిల్స్ చరిత్రలో ఇటలీ నుంచి ఫైనల్స్‌కు అర్హత సాధించిన తొలి మహిళ క్రీడాకారిణిగా రికార్డులకెక్కింది. 2 గంటల 51 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ పోరులో పలోని తొలి సెట్‌లో ఓడినా తర్వాత పుంజుకుని రెండో సెట్‌ను గెలుచుకుని పోటీలోకి వచ్చింది. కీలకమైన మూడో సెట్‌లో టైబ్రేక్ ద్వారా ఫలితం తేలినా చివరి దాకా పట్టుదలగా ఆడి టైటిల్ పోరుకు చేరుకుంది. ఈ మ్యాచ్‌లో ఓడినా వెకిచ్ పోరాటం ఆకట్టుకుంది. క్రెజికోవ, రిబాకినా మధ్య జరిగే రెండో సెమీస్ విజేతతో పలోని ఫైనల్ ఆడనుంది. పురుషుల సెమీస్‌లో భాగంగా శుక్రవారం జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ అల్కారజ్, ఐదో సీడ్ మెద్వెదెవ్‌తో తాడోపేడో తేల్చుకోనున్నాడు. రెండో సెమీస్ ముసెట్టి, జొకోవిచ్ మధ్య జరుగనుంది.

బోనస్ నాక్కూడా వద్దు!

ముంబై: టీమ్‌ఇండియా సారథి రోహిత్ శర్మ సైతం మాజీ హెడ్‌కోచ్ రాహుల్ ద్రావిడ్ బాటలోనే నడిచాడు. ప్రపంచకప్ గెలిచిన తర్వాత బీసీసీఐ ప్రకటించిన క్యాష్‌ప్రైజ్ రూ.125 కోట్లలో తన వాటాకు వచ్చిన బోనస్(రూ. 5 కోట్లు)ను సపోర్ట్ స్టాఫ్‌కు ఇచ్చేందుకు నిర్ణయించుకున్నట్టు సమాచారం. బీసీసీఐ ఆటగాళ్లకు రూ.5 కోట్లు, కోచింగ్ స్టాఫ్‌కు రూ.2.5 కోట్లు, ఇతర సహాయక సిబ్బందికి కోటి రూపాయల చొప్పున ఇవ్వడంపై రోహిత్ అసంతృప్తిగా ఉన్నాడని వినికిడి.

'సచిన్ బెస్ట్ బ్యాటర్': అండర్సన్

లండన్: తన బౌలింగ్ ఎదుర్కొన్న వారిలో భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ అత్యుత్తమ బ్యాటర్ అంటూ ఇంగ్లండ్ వెటరన్ పేసర్ జేమ్స్ అండర్సన్ పేర్కొన్నాడు. వెస్టిండీస్‌తో తొలి టెస్టు ద్వారా తన సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలుకబోతున్న అండర్సన్ అనుభవాలను పంచుకున్నాడు. 'నేను చూసిన అత్యుత్తమ బ్యాటర్లలో సచిన్ టెండ్కూలర్. అతన్ని ఔట్ చేసేందుకు ఎప్పుడు ప్రత్యేక ప్రణాళికలు ఎంచుకోలేదు. కానీ చెత్త బంతులు వేస్తే కచ్చితంగా దీటైన ప్రతిస్పందన వస్తుందనుకునే గొప్ప బ్యాటర్ సచిన్. అతను భారత్‌కు ఎంతో కీలకమైన ప్లేయర్. భారత్‌లో సచిన్‌ను ఔట్ చేస్తే..మైదానంలో వాతావరణం పూర్తిగా మారిపోయింది.అతనిది ఎంతో కీలకమైన వికెట్' అని అన్నాడు.

గెలుపు దిశగా..

లండన్: లార్డ్స్ వేదికగా వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లండ్ గెలుపు దిశగా సాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో విండీస్ 121 పరుగులకే ఆలౌట్ అయిన విషయం తెలిసిందే. ఓవర్ నైట్ స్కోరు 189/3 వద్ద రెండో రోజు ఆట ఆరంభించిన ఇంగ్లండ్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 371 పరుగులకు ఆలౌట్ అయింది. రూట్ (68), బ్రూక్ (50) అర్ధ సెంచరీలతో రాణించగా తన కెరీర్‌లో తొలి టెస్టు ఆడుతున్న వికెట్ కీపర్ జెమీ స్మిత్ (70) ఆకట్టుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో 250 పరుగులు వెనుకబడ్డ విండీస్.. రెండో ఇన్నింగ్స్‌లోనూ తడబడుతోంది. టాపార్డర్ వైఫల్యంతో ఆ జట్టు 20 ఓవర్లకే 4 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి విండీస్ 34.5 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 79 పరుగులు చేసింది. ఏదైనా అద్భుతం జరిగితే తప్ప ఈ టెస్టులో విండీస్ ఓటమి లాంఛనమే!

లంకతో సిరీస్‌కు వేదికలు ఖరారు

పల్లెకెలెలో టీ20లు, కొలంబోలో వన్డే సిరీస్

ఢిల్లీ: ప్రస్తుతం జింబాబ్వే పర్యటనలో టీ20లు ఆడుతున్న టీమ్‌ఇండియా అవి ముగిశాక ఈ నెలాఖరున శ్రీలంక టూర్‌కు వెళ్లనుంది. ఈ మేరకు శ్రీలంక క్రికెట్ బోర్డు (ఎస్ఎల్‌సీ) మ్యాచ్‌లు జరిగే వేదికలను గురువారం ఖరారు చేసింది. ఈ పర్యటనలో భాగంగా భారత్.. ఆతిథ్య జట్టుతో జూలై 26, 27, 29 మధ్య పల్లెకెలె అంతర్జాతీయ స్టేడియంలో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది. కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియం వేదికగా ఆగస్టు 1, 4, 7 తేదీలలో వన్డేలు ఆడాల్సి ఉంది. ప్రధాన ఆటగాళ్లకు రెస్ట్ ఇచ్చే యోచనలో ఉన్న భారత్.. ఈ టూర్‌లోనూ యువ ఆటగాళ్లతోనే బరిలోకి దిగే అవకాశాలున్నాయి. ఇక భారత హెడ్‌కోచ్‌గా గౌతం గంభీర్‌కు ఇదే తొలి పరీక్ష కానుంది.

హసరంగ రాజీనామా

టీ20 ప్రపంచకప్‌లో శ్రీలంక వైఫల్య ప్రదర్శనతో ఈ మెగాటోర్నీలో ఆ జట్టును నడిపించిన వనిందు హసరంగ సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. వరల్డ్‌కప్ ఓటమి అనంతరం ఆ జట్టు హెడ్‌కోచ్ క్రిస్ సిల్వర్‌వుడ్ సైతం రాజీనామా చేయగా తాజాగా హసరంగ సైతం తప్పుకోవడం గమనార్హం.

మేము రాం!

చాంపియన్స్ ట్రోఫీ కోసం పాక్‌కు వెళ్లేది లేదన్న భారత్ • హైబ్రిడ్ మోడల్‌కు ఓకే

ఢిల్లీ: వచ్చే ఏడాది పాకిస్థాన్ ఆతిథ్యమివ్వనున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో హైబ్రిడ్ మోడల్ తప్పేలా లేదు. ఏడేండ్ల విరామం తర్వాత జరుగుతున్న ఈ మెగా టోర్నీలో ఆడేందుకు గాను దాయాది దేశం వెళ్లడానికి భారత్ నిరాకరించడమే ఇందుకు కారణం! ఆటగాళ్ల భద్రతా కారణాల దృష్ట్యా పాక్‌కు వెళ్లేది లేదని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) వర్గాలు చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో టీమ్‌ఇండియా పాక్‌లో పర్యటిస్తుందని భారీ ఆశలు పెట్టుకున్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కు మరోసారి షాక్ తగిలింది. చాంపియన్స్ ట్రోఫీకి సంబంధించిన షెడ్యూల్‌ను పీసీబీ ఇది వరకే ఐసీసీకి అందజేయగా దీనికి బీసీసీఐ ఆమోదం తెలపలేదని బోర్డు వర్గాలు చెబుతున్నాయి. భారత క్రికెట్ జట్టు పాక్‌కు వెళ్లే అంశం కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉందని స్పష్టం చేస్తూ హైబ్రిడ్ మోడల్‌లో యూఏఈ లేదా శ్రీలంకలో టీమ్‌ఇండియా ఆడే మ్యాచ్‌లు ఆడించాలని ఐసీసీ ముందు ప్రతిపాదన ఉంచినట్టు సమాచారం. ఈ మేరకు బీసీసీఐ ప్రతినిధి ఒకరు స్పందిస్తూ.. 'భారత జట్టు పాక్‌కు వెళ్లేది కష్టమే. అయితే తుది నిర్ణయం మాత్రం కేంద్ర ప్రభుత్వం తీసుకోవాల్సి ఉంది. అలాంటప్పుడు హైబ్రిడ్ మోడల్ సాధ్యపడుతుంది. ఆసియా కప్‌లో మాదిరిగానే చాంపియన్స్ ట్రోఫీలో భారత్ తమ మ్యాచ్‌లను యూఏఈ లేదా శ్రీలంకలో ఆడొచ్చు. ఐసీసీ సైతం దీనిపై దృష్టి సారించింది' అని తెలిపాడు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.